'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేషాదరణ

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- రోగులకు మందుల అందజేత

ముత్తుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషాదరణ లభిస్తోందని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని డమ్మాయపాళెం హైస్కూల్‌లో గురువారం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి కాకాణి పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వారికి అందజేస్తున్న మందులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 520 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించగా, అందులో 2.50 లక్షల మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారని వివరించారు. ఈ సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు హర్షిత, సునీల్‌కుమార్, కృష్ణచైతన్య, తులసీకుమారి తదితరులు 508 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంత్రి చేతుల మీదుగా రోగులకు మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ సన్నారెడ్డి హారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, ఎంపీపీ సుగుణ, ఎంపీడీఓ ప్రత్యూష, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, దయాకర రెడ్డి, దువ్వూరు కోదండరామరెడ్డి పాల్గొన్నారు.

తాటిపర్తిలో..

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి జెడ్పీహైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. గ్రామస్తులు వివిధ రకాల జబ్బులకు పరీక్షలు చేయించుకున్నారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వృద్ధులకు కంటికి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలియజేశారు. శిబిరంలో ఉపసర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, పొదలకూరు సీహెచ్‌సీ వైద్య నిపుణులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


ముత్తుకూరు : వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పేదల చెంతకే వైద్యసేవలు

మనుబోలు : పేదల చెంతకు వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చి వారి ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ప్రెసిడెంట్ మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తోందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమన్నారు. ఈ శిబిరంలో వైద్యులు సుబ్బరాజు, వేమయ్య, చందన జ్ఞానప్రసూన 450 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్ రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఎంఈఓ రమేష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి రేష్మసోని, వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

ఇందుకూరుపేట : అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం అని ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని కొమరిక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల చెంతకే వచ్చి ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ తిక్కవరపు వసుంధరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు గూడూరు శివకుమార్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

తోటపల్లిగూడూరు : ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీడీఓ హేమలత అన్నారు. మండలంలోని కోడూరు బిట్–1కు సంబంధించి చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ హేమలత మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆరోగ్యం పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో కోడూరు–1 సచివాలయ పరిధిలోని 350 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఆగాల శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డి అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వైద్య శిబిరాలను ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నారని, కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుతున్నట్లు వివరించారు. అనంతరం వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీడీఓ శ్రీహరి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేణుగోపాల్, వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి, పార్టీ నేత కె.ప్రసాద్, వైద్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.


పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్


పొదలకూరు : కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు


పొదలకూరు : కేస్‌షీట్ అందజేస్తున్న ఉపసర్పంచ్ లచ్చారెడ్డి


కోవూరు : జేబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో..


తోటపల్లిగూడూరు : చెన్నపల్లిపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేంద్రబాబు


మనుబోలు : వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు


మనుబోలు : మాట్లాడుతున్న ఎంపీపీ వజ్రమ్మ

క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

28న పాక్షిక చంద్రగ్రహణం

ముత్తుకూరు : ఈనెల 28వ తేదీ శనివారం రాత్రి 1.04 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుందని స్థానిక జ్యోతిష్యమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఇది మేషరాశిలో అశ్వని నక్షత్రంలో జరిగే రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం అని అన్నారు. ఈ గ్రహణ అనంతరం ఆదివారం వేకువన గోమూత్రం, కల్లుప్పు–పసుపుతో కలిపిన నీటితో గృహాలను శుభ్రం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కోవూరు : మండలంలోని పడుగుపాడు నేతాజీనగర్‌లో సుబ్బారావు అనే వ్యక్తి ఆరు నెలల క్రితం కేన్సర్‌తో మరణించగా, ఆయన భార్య సరోజినమ్మకు డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకు సత్కారం


ఎస్సైను సత్కరిస్తున్న సతీష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేంద్రను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీహెచ్ సతీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో నూతన డీఆర్వో ఎస్ లవన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని డీఆర్వోకు తెలిపారు.

రేపు శంకరమఠంలో చండీ హోమం

నెల్లూరు(బృందావనం): ఆశ్వీయుజ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేట శంకరమఠంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు గురువారం తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా ఏఓలు

నెల్లూరు(పొగతోట): ఎంపీడీఓలకు డీఎల్‌డీఓలుగా పదోన్నతులు లభించడంతో ఆయా మండలాల్లో పనిచేస్తున్న పరిపాలనాధికారులను ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ చిరంజీవి ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. వెంకటాచలం మండలానికి ముజిబున్నీసాబేగం, టీపీగూడూరుకు ప్రత్యూష, ముత్తుకూరుకు లక్ష్మణకుమార్, దుత్తలూరులో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న సాయిప్రసాద్‌ను ఎంపీడీఓలుగా నియమించారు.

అమ్మవారికి ప్రత్యేకాలంకరణ


మనుబోలు: దుర్గాదేవిగా అమ్మవారు


మనుబోలు: కన్యకాపరమేశ్వరి అలంకారంలో..

మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో గురువారం అమ్మవారు దుర్గాదేవి, కన్యకాపరమేశ్వరి, సంతానలక్ష్మి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం వద్ద అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి కన్యకాపరమేశ్వరి అలంకారం, దసరా చావిడి వద్ద అర్చకుడు హరికృష్ణ దుర్గాదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలాగే మనుబోలు దసరా చావడి వద్ద అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ అమ్మవారిని సంతానలక్ష్మిగా అలంకరించి మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయకర్తలుగా మారంరెడ్డి సోదరులు, ఎస్.సుబ్రహ్మణ్యం–సురేఖ దంపతులు, పొట్టి నాగేంద్ర–అనూరాధ దంపతులు వ్యవహరించారు.

అమ్మవారికి విశేష పూజలు

పొదలకూరు : శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో అమ్మవారు శయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. లలితా సహస్రనామార్చన, ఖడ్గమాల పూజలను జరిపించారు. తన్నీరు బాలకృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉభయకర్తగా వ్యవహరించారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

ఇందుకూరుపేట : ప్రతి రైతు తమ పేర్లను ఈ–పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో ఈ–పంటలో నమోదైన రైతుల పేర్లను గురువారం ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వాటి పరిధిలోని రైతుల పేర్లను ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందుకూరుపేట మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 6,118 ఎకరాల విస్తీర్ణానికి గానూ 1,836 మంది రైతులను ఈ పంటలో నమోదు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.


జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ రఘునాథ్‌రెడ్డి

ఓపెన్ స్కూల్‌ను ఉపయోగించుకోండి

ఇందుకూరుపేట : పదో తరగతి, ఇంటర్, అంతకంటే తక్కువ చదువుతూ మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ను ఉపయోగించుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ నాగేంద్ర కోరారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఓపెన్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరికీ చదువు చాలా విలువైనదని, మధ్యలో చదువు మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళా సంఘ సభ్యులను కలిసి కార్యక్రమ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ రామారావు, ఎంఈఓలు ఎస్వీ నాయక్, సునీల్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం వి.మల్లికార్జున, సీఆర్‌ఎంటీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అడ్మిషన్లు అందజేస్తున్న స్టేట్ అబ్జర్వర్ నాగేంద్ర

నేడు సురక్ష శిబిరానికి మంత్రి కాకాణి రాక

పొదలకూరు : పొదలకూరు బిట్–2 సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరవుతారని ఎంపీడీఓ నగేష్ కుమారి గురువారం తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్లో ఏర్పాటు చేసే శిబిరాన్ని మంత్రి తనిఖీ చేస్తారన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన చాటగొట్ల–బిరదవోలు తారురోడ్డును మంత్రి కాకాణి ప్రారంభిస్తారన్నారు.

నేడు జమ్మిపాళేనికి ఎమ్మెల్యే ప్రసన్న రాక

కోవూరు : మండలంలోని ఇనమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న జమ్మిపాళేనికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి శుక్రవారం వస్తారని డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలో టీటీడీ నిధులతో నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టకు హాజరు కానున్నట్లు ఆయన తెలియజేశారు.

కృత్రిమ మేధపై అవగాహన

కొడవలూరు : మండలంలోని నార్నురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 'కృత్రిమ మేధ–పరిశోధనా పరిధి'పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పట్నా సిడ్యాక్ ఏఐ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన పి.సాయికుమార్ ముఖ్యవక్తగా వ్యవహరించారు. కృత్రిమ మేధపై పరిశోధనా విషయాలు, అన్ని రంగాల్లో కృత్రిమ మేధ ఉపయోగాలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌సీ విభాగాధిపతి డాక్టర్ నాగేంద్ర, ఏఐడీఎస్ విభాగాధిపతి జీవన్‌కుమార్, బీటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరపు విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పలు మండలాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కందుకూరు తహసీల్దార్‌గా ఎం నిరంజన్‌బాబును నియమించారు. అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సెలవులో ఉన్న టీ ప్రదీప్‌ను తెలుగుగంగ ప్రాజెక్ట్ రాపూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. పొదలకూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ నవీన్‌కుమార్‌ను కలెక్టరేట్ డీ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. చేజర్ల మండలంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం గిరీష్‌ను దుత్తలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలువాయి మండలం కసుపూరుపల్లి బిట్–1 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న డీ జయరామయ్యను మర్రిపాడు మండలానికి బదిలీ చేశారు.

కసుమూరులో స్వచ్ఛభారత్

వెంకటాచలం : మండలంలోని కసుమూరులో ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌కు సంబంధించి టీమ్ లీడర్లు కందుకూరు యశ్వంత్, పి.కార్తీక్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు ముందుగా వీధులను శుభ్రం చేశారు. పలు దుకాణాల వద్దకు వెళ్లి శుభ్రత, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటు రోగాలు ప్రబలవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మీపతి, యశ్వంత్ కృష్ణ, సింహాద్రి, దీపక్, హేమలత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


వీధులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కూలి రేట్లు పెంచాలని నిరసన

కోవూరు : మండలంలోని ఇనమడుగు సెంటర్ పరిసరాల్లోని ప్రైవేటు గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని బీడబ్ల్యూసీ గోదాము ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర సీఐటీయూ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి శేషయ్య మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టకుండా మొండిగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికే అనేక దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. జిల్లాలోని అన్ని గోదాముల్లో బస్తాకు రూ.7 కూలి ఇస్తుంటే ఇనమడుగు సెంటర్లోని గోదాముల్లో మాత్రం కేవలం రూ.2.90 మాత్రమే ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఈ గోదాముల్లో స్థానిక కార్మికులను కాదని ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి పనిచేయించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.శ్రీనివాసులు, సీఐటీయూ నేతలు ఎస్.అంకయ్య, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న హమాలీ కార్మికులు

అన్నిరంగాల్లో రికార్డు స్థాయిలో అభివృద్ధి


ఈపూరులో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

ముత్తుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నిరంగాల్లో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు జరిగాయని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఈపూరు పంచాయతీలో గురువారం రూ.63.50 లక్షల విలువైన సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత దేశ ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 60 దేవాలయాలు మంజూరు చేయించామన్నారు. వివిధ దశల్లో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. పేదలు కోరుకున్న ప్రతి అంశాన్ని నెరవేర్చామన్నారు. ముత్తుకూరు మండలంలో 1,900 కుటుంబాలకు ఇంటి నివేశన పట్టాలను పంపిణీ చేశామన్నారు. 16,300 కుటుంబాలకు మత్స్యకారేతర ప్యాకేజీ పంపిణీ చేశామన్నారు. చుక్కల భూముల సమస్య పరిష్కారమైందన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ల పాలనలో ఈ సచివాలయం పరిధిలో రూ.3.23 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

సోమిరెడ్డి అవినీతికి బ్రాండ్ అంబాసిడర్

సర్వేపల్లికి గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేసిన వ్యక్తి (సోమిరెడ్డి) అవినీతి–అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారని కాకాణి మండిపడ్డారు. ఇటువంటి వ్యక్తులతో పోల్చుకొనే స్థాయిలో తాము లేమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పార్టీ నేతలు అనంతరాజు వేణుగోపాలరావు, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, రాగాల వెంకటేశ్వర్లు, దొరువులపాళెం సర్పంచ్ సునంద, మాజీ సర్పంచ్ వీరరాఘవయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.